ఆధార్ లింక్.. అక్రమాలకు చెక్

- ఉపాధిలో ప్రతి జాబ్‌కార్డుకు ఆధార్ లింక్
- లేకుంటే కూలీ డబ్బులు నిలిపివేత
- నేటినుంచి ఉపాధి పనులు ప్రారంభం

మహబూబాబాద్ అర్బన్: పేదలు, కూలీలు వలసలు వెళ్ల కూడదని, ఆకలి కేకలు ఉండకూడదని, ఆత్మహత్యలకు పాల్పడకూడదనే సదుద్దేశంతో గ్రామాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో 100రోజుల పని దినాలు కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2005లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమల్లోకి తెచ్చింది. అయితే తాజాగా ఉపాధి హామీ కూలీలకు ఇచ్చే జాబ్ కార్డులకు తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేయాలని షరతు విధించింది. వెంటనే కూలీలందరూ తమ జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేయాలని, లేకుంటే చెల్లింపులు నిలిపివేస్తామని హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వార్నింగ్‌తో పంచాయతీ కార్యదర్శులు, జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో ఆధార్ అనుసంధానం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఆధార్‌తో లింక్..

జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో 1,40,300 మంది ప్రజలు ఉపాధి హామీ జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. ఒక్కో కుటుంబానికి ఒక్కో జాబ్‌కార్డును మాత్రమే ఇస్తారు. జాబ్‌కార్డుల్లో 2,55,717 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు 2006 సంవత్సరంలో జాబ్ కార్డులను మంజూరు చేశారు. ఆ సమయంలో ఒక కుటుంబం పేరిట రెండు జామ్ కార్డులు నమోదయ్యాయి. జిల్లాలోని కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు కూడా జాబ్‌కార్డులు ఉన్నాయని, అదేవిధంగా ఒక్కొక్కరికి రెండు చోట్ల జాబ్‌కార్డులు ఉండటం, కొన్ని చోట్ల జాబ్‌కార్డులో ఒక పేరు, ఆధార్ కార్డులో మరోపేరు ఉండడంతో వేతన చెల్లింపుల్లో అనే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈపథకంలో అనేక అక్రమాలు జరుగుతున్నట్లు అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఇలా వీటన్నింటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఆధార్‌కార్డుతో జాబ్‌కార్డును లింకు చేయడానికి శ్రీకారం చేస్తున్నారు. దీంతో వేతన చెల్లింపుల్లో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ఉండటంతో పాటు అర్హులకు పని కల్పించేందుకు వీలుకలుగుతుంది. ఈ క్రమంలో జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం కోసం క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీల వద్ద నుంచి ఆధార్, జాబ్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో గ్రామీణ ఉపాధి హామీ జిల్లా అధికారులు నమోదు చేస్తున్నారు.



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

మండలాలు	జాబ్‌కార్డులు	కూలీలు
బయ్యారం	8,372	14,167
చిన్నగూడురు	3,254	5,270
దంతాలపల్లి	6,185	11,457
దోర్నకల్	10,065	18,105
గంగారం	2,786	5,283
గార్ల	7,003	12,721
గూడూరు	14,287	26,102
కొత్తగూడ	6,598	12,273
కేసముద్రం	13,792	25,197
కురవి	12,930	23,306
మానుకోట	10,007	18,583
మరిపెడ	12,528	23,188
నర్సింహులపేట	7,399	14,031
నెల్లికుదురు	12,220	23,991
పెద్దవంగర	4,931	8,777
తొర్రూరు	7,976	13,266
మొత్తం	1,40,300	2,55,717

తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి



నేటినుంచి ఉపాధిహామీ పనులు ప్రారంభం కానున్నాయి. జాబ్‌కార్డులకు ఆధార్ కార్డులు అనుసంధానం ఆన్‌లైన్‌లో చేసుకోవాలి. ఇప్పటికే జిల్లాలో ఆధార్‌కార్డు నమోదు చేయడంలో 80శాతం పూర్తి చేశాం. జిల్లా వ్యాప్తంగా కూలీలు జాబ్ కార్డులు ఉన్న వారందరూ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి.

– ఆర్.సన్యాసయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి

క్లుప్తంగా

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల కోఆర్డినేటర్ ప్రత్యూష తెలిపారు. ఇంటర్ ప్రవేశ పరీక్షకు 2352 మందికి 2257 హాజరు కాగా, 95 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. డిగ్రీ ప్రవేశ పరీక్షలో మొత్తం విద్యార్థులు 552 మందికి 500మంది హాజరుకాగా 50మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

ఆర్థికసాయం



పెద్దవంగర: మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన చెరుకు శోభన్(23) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం మృతుడు పని చేసిన టువెల్ హెల్త్ క్యాపిటల్ సంస్థ నుంచి సీఈఓ రావుల సత్యనారాయణ రూ.50 వేలు అందజేశాడు. గ్రామానికి చెందిన జాటోతు రవి 50 కేజీల బియ్యం, సూపర్ కింగ్ సభ్యులు పరామర్శించారు. కార్యక్రమంలో గులామ్ హమ్మద్, ప్రసాద్, సతీష్, బాలరాజు, శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ టీపీలో చేరిక



నెల్లికుదురు: కేసీఆర్ అవినీతి పాలనలో విసుగెత్తిన ప్రజలంతా వైఎస్సార్ టీపీ చేరాలని మహబూబాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోతు రాములు అన్నారు. మండలంలోని బంజర శివారు నంద్య తండాలో ఆదివారం వివిధ పార్టీల నుంచి 20 కుటుంబాలు 100 మంది వైఎస్సార్ టీపీలో రాములునాయక్ ఆధ్వర్యంలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీపీ మండల అధ్యక్షుడు యాకూబ్ నాయక్, మోహన్‌నాయక్, శివ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు రైతుల వినతి



మహబూబాబాద్/కేసముద్రం: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందని పలువురు రైతులు కలిసి డీపీఎం 48 కెనాల్‌కు ఓటీ పాయింట్ ఏర్పాటు చేయించాలని వినతి ఇచ్చారు. కాగా ఎమ్మెల్యే స్పందించి వెంటనే కెనాల్‌కు ఓటి పాయింట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, వెంకన్న, రామ్మోహన్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, సత్యనారాయణ తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని బొడ్రాయి సన్నిధిలో కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ విభాగం జాతీయ ఉపాధ్యక్షుడు తేజావత్ బెల్లయ్యనాయక్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎడ్ల రమేష్, కర్పూరపు గోపి, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, గుగులోత్ హరినాయక్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణు, శాలివాహన పూజారులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేయాలి

గార్ల: గార్ల పాకాల ఏటికి శ్రీరాంసాగర్ కెనాల్ నీటిని విడుదల చేసి రైతుల వరిపంటలను కాపాడాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు, వైస్ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాసరావు జిల్లా ఇరిగేషన్ అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి వెంకన్న, కృష్ణమూర్తి, బిక్షమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి సన్మానం



పెద్దవంగర: అంకితభావంతో ప్రజలకు ఉత్తమ సేవలకు కృషి చేస్తుందుకుగాను ఎంపీపీ ఈదురు రాజేశ్వరి పలువురి సమక్షంలో సన్మానం పొందారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో మహిళా దినోత్సవం వేడుకను ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేశ్వరికి శాలువాలతో సన్మానించారు. అదేవేదికలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్ రావు జ్ఞాపికలను అందజేసి సత్కారించారు. కార్యక్రమంలో నాగవాణి, ట్రస్టు కోఆర్డినేటర్ పంజాల కల్పన, ఏఎంసీ చైర్మన్ పసుమర్తి శాంత, డాక్టర్ నాగవాణి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సముచిత స్థానం కల్పించాలి



మహబూబాబాద్ రూరల్: మాట్లాడుతున్న సీతామహాలక్ష్మి

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పించాలని, స్త్రీలను గౌరవించాలని బహుజన పూజరుల శివసత్తుల సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు బాబూరావు, డాక్టర్ సీతామహాలక్ష్మీ అన్నారు. సేవాలాల్ సేన, బహుజన పూజరుల శివసత్తుల సేవాసమితి ఆధ్వర్యంలో మానుకోట జిల్లా కేంద్రంలోని మార్వాడీ సత్రంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ సతీమణి డాక్టర్ సీతామహాలక్ష్మీ హాజరై మాట్లాడారు. మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా అందరం కంకణ బద్ధులై కాపాడాలని, మహిళలపై దాడులను ఖండిస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు, వైద్యశాఖ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసువిభాగం, స్వచ్ఛంద సేవా సంస్థ మహిళలు, టీచర్లు మొత్తం వంద మందిని షీల్డులు, శాలువాలు, పూలదండలతో సత్కరించి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రియాంక, టౌన్ ఎస్సై దీపికా, సఖీ మండలి పద్మకలంత్రి, సేవాలాల్ మహిళ సేన లకావత్ పద్మ, సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్న, సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందులాల్, టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు గుగులోత్ రవి పాల్గొన్నారు.

మనువాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

కేసముద్రం: దేశంలో పురుషాధిపత్యాన్ని స్థిరీకరిస్తున్న మనువాదానికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి బొమ్మనబోయిన అనసూర్యక్క అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సరస్వతీ, జీనుగు పద్మ, బుజ్జి, సారమ్మ, కమలమ్మ, భద్రి, విజయ, అనసూయ, రోజ, గీత, చుక్కమ్మ పాల్గొన్నారు.

మృతిపై సీబీఐచే విచారణ చేపట్టాలి



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నెహ్రూసెంటర్: వైద్య విద్యార్థి ప్రీతి మృతిపై సీబీఐ విచారణ జరిపించి, ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని, మృతికి కారకులైన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోత్ కిషన్ నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం దళిత, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా గుగులోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ.. ప్రీతి మృతికి కారణమైన సీనియర్ విద్యార్థి సైఫ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, హత్యా నేరం కింద శిక్షించాలన్నారు. కళాశాలలో ర్యాగింగ్, వేధింపులు జరుగుతున్న నిర్లక్ష్యం వహించిన హెచ్‌ఓడీ, ప్రిన్సిపాల్ పై చర్య తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుండ్లెల రాంమూర్తి, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కామ సంజీవరావు, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు బోడ రమేష్, వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు గుంజె హన్మంతరావు, మునిగంటి వెంకన్న, మందుల వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

నిఘా నేత్రాలు.. నేలచూపులు

- డోర్నకల్‌లో పని చేయని సీసీ కెమెరాలు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొంతకాలంగా పని చేయడం లేదు. స్థానికుల సహకారంతో సుమారు మూడేళ్ల క్రితం పోలీసులు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 74 కెమెరాలను ఏర్పాటు చేయగా కెమెరాల సహకారంతో పలుమార్లు శాంతిభద్రతలకు సంబంధించిన కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి. సీసీ కెమెరాల ఏర్పాటుతో ప్రజలతోపాటు పోలీసులు కూడా ప్రశాంతంగా ఉన్నారు. కొన్ని రోజుల తరువాత తరచూ కెమెరాలు మరమ్మతులకు గురవుతుండటంతో పోలీసులు పలుమార్లు మరమ్మతులు చేయించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి షాక్ సర్క్యూట్, స్పార్క్, పీఓఈ స్విచ్‌లు కాలిపోవడం, ఉరుములతో కూడిన వర్షాలు, కోతుల వీరంగంతో కెమెరాలు మరమ్మతులకు గురవుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో పలు వీధుల్లో విద్యుత్ స్తంభాలను అమర్చడంతోపాటు ఇతర పనులతో సీసీ కెమెరాలకు సంబంధించి కేబుల్ వ్యవస్థ ధ్వంసం కావడంతో పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోలింగ్ వ్యవస్థ పని చేయడం లేదు. ఈకారణాలతో ప్రస్తుతం పట్టణంలోని సీసీ కెమెరాలు పని చేయడం లేదు.

నిధుల కొరత.. పర్యవేక్షణ లేదు

సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించేందుకు ప్రత్యేక సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కెమెరాలు మరమ్మతులకు గురైన ప్రతీసారి స్థానికంగా ఉండే మెకానిక్‌లను పిలిపించి మరమ్మతులు చేయిస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణ కోసం ఎలాంటి నిధుల కేటాయింపు లేకపోవడంతో కొత్త కెమెరాల ఏర్పాటు, మరమ్మతుల కోసం పోలీసులు స్థానికుల సహకారం తీసుకుంటున్నారు. వివిధ కారణాలతో కెమెరాలు తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం డోర్నకల్ మున్సిపాలిటీకి సీఎం కేసీఆర్ రూ.25 కోట్ల నిధులు కేటాయించడంతో సీసీ కెమెరాల మరమ్మతులు, నిర్వహన కోసం కొంత డబ్బును కేటాయించాలని పోలీసులు, స్థానికులు మున్సిపాలిటీ అధికారులు, పాలకవర్గాన్ని కోరుతున్నారు.



ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



రైల్వే స్టేషన్ సెంటర్‌లో కిందికి వాలిన సీసీ కెమెరాలు

ప్లాట్‌ఫారం మారడంతో ఇబ్బంది పడిన ప్రయాణికులు

డోర్నకల్: డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపైకి రావాల్సిన రైలు రెండో నంబర్ ప్లాట్‌ఫారంపైకి రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ లోని ఒకటవ నంబర్ ప్లాట్‌ఫారంకు గుంటూరు నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఉదయం 9గంటల సమయంలో రావాల్సి ఉంది. ప్రయాణికులంతా ఒకటవ నంబర్ ప్లాట్‌ఫారంపై ఎదురు చూస్తున్న సమయంలో ఒకటవ నంబర్ ప్లాట్‌ఫారంపై గూడ్సు రైలు నిలిచి ఉంది. ఓ రైల్వే యాప్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ మూడో నంబర్ ప్లాట్‌ఫారంపైకి వస్తుందని సూచించడంతో కొంత మంది ప్రయాణికులు పుట్‌ఓవర్ బ్రిడ్జి మీదుగా మూడో నంబర్ ప్లాట్‌ఫారంపైకి చేరుకున్నారు. కొద్ది సేపట్లో రైలు రెండో నంబర్ ప్లాట్‌ఫారంపైకి వస్తుందని మైకులో అనౌన్స్ చేయడంతో 1, 3వ నంబర్ ప్లాట్‌ఫారాలపై రైలు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు హడావుడిగా పుట్‌ఓవర్ బ్రిడ్జి మీదుగా రెండో నంబర్ ప్లాట్‌ఫారంపైకి చేరుకున్నారు. దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు, పిల్లల తల్లులు తమ లగేజీతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఇద్దరికి గాయాలు

మరిపెడ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబా ఆలయం సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లాలు బైక్ రోడ్డుపై వెళ్తున్న హర్యను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈప్రమాదంలో హర్యతోపాటు లాలుకు కూడా తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎరుకల కులస్తులను ఆదుకోవాలి

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఎరుకుల కులస్తులను ఆదుకోవాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం కేసముద్రం విలేజీలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు ఎరుకుల కులస్తులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయన్నారు. ఇప్పటికైనా కులస్తులు ఐక్యంగా విద్యా, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ, ఆర్థికాభివృద్ధి కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాగం మల్లయ్య, పాపయ్య, కూతాటి యాకయ్య, ప్రశాంత్, చిన్న వెంకన్న, దేవరాజ్, ఎల్లయ్య, వీరన్న, ఉపేందర్, రవీందర్, సోమన్న పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వేడుకలు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి నెహ్రూసెంటర్ వరకు ఆదివారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. హరీశ్‌రాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరీ ఆదేశాల మేరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఒబిలిశెట్టి రామకృష్ణ, అర్బన్ పీహెచ్‌సీ వైద్యులు అబ్దుల్, విరాజిత, ప్రత్యూష, ఆశవర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



గార్ల: పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తూ, అర్హులందరికీ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి మూడోసారి అధికారం చేపట్టడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. సమావేశంలో ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, సర్పంచ్‌లు జ్యోతినర్సింహా, శ్రీను, భారతిహరిలాల్, మురళి, గణేష్, శ్రీనివాస్, లింగయ్య, బాబు, తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో సత్తా చాటిన విద్యార్థులు



గార్ల: ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి అబాకస్ గణితం పోటీల్లో గార్ల నిర్మలా హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన ఈ పోటీలో 4, 5వ తరగతి విద్యార్థులు జూనియర్ విభాగంలో అజ్మీర దీపక్ ప్రథమస్థానం, సీనియర్ విభాగంలో దువ్వ యువసంకీర్త్ ద్వితీయస్థానంలో గెలుపొందారు. ప్రిన్సిపాల్ సిస్టర్ జెయిస్, కరస్పాండెంట్ సిస్టర్ టెస్సీ, ఉపాధ్యాయులు ప్రవీణ్, సురేందర్, నరేష్ అభినందించారు.

రచయిత్రికి సన్మానం

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమురయ్య హాల్‌లో తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, రచయిత్రి డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మను తెలంగాణ సాహితి ప్రముఖ రచయిత తిరుమలగిరి దేవకిదేవి ఘనంగా సన్మానించారు.

వీరన్న సన్నిధిలో పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం పురగిరి క్షత్రియ పెరిక సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లింగయ్య, సంఘం కోశాధికారి మనోహర్, నాయకులు పాల్గొన్నారు.

సినీ రంగంలోనూ రాణించాలి



సినీనటులతో చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్: మానుకోట నటులు సినీరంగంలోనూ రాణించాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి కోరారు. కె.అనిల్ దర్శకత్వంలో మల్లిక్ నిర్మాతగా నటుడు రాజమౌళి నటించిన డీజే భరత్‌సాంగ్ షూటింగ్‌ను మున్సిపల్ పరిధిలోని 11వార్డులో చేపట్టారు. కాగా షూటింగ్‌ను చైర్మన్ ప్రారంభించి మాట్లాడారు సినీరంగంలో కూడా మానుకోటకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడుగా రాణించిన చక్రిది మానుకోట జిల్లాలోని కంబాలపల్లి గ్రామం అని, కాని ఆయన మృతి సినీరంగానికి, మానుకోటకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాలునాయక్, శరత్, జగన్, శోభన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాలస్వామి వారికి కలశాభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకులు

మహబూబాబాద్ రూరల్: శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో కలశాభిషేకం, మహాపూర్ణాహుతి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మి నారాయణచార్యులు ఆధ్వర్యంలో యాజ్ఞికులు, సహ అర్చకులు శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి ఉత్సవ మూర్తులకు 25 కలశాలతో అభిషేకాలు నిర్వహించారు.

అనంతాద్రిలో ధ్వజారోహణం

అనంతాద్రి శ్రీవారి అష్టదశ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా మండలంలోని శ్రీస్వయంభూ జగన్నాథ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం ధ్వజారోహణం పూజలు నిర్వహించారు. అనంతరం గరుడ ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ ట్రస్టీ నూకల రామచంద్రారెడ్డిజ్యోతి దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి చక్రధరాచార్యులు, శ్రవణ్ కుమారాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన 1990–1991 విద్యా సంవత్సరం ఎస్సెస్సీ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా చిన్న నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను సత్కరించారు. అనంతరం ఇనుగుర్తి జెడ్పీ హైస్కూల్‌కు రూ.25వేల విలువైన 50 కుర్చీలను, టీపాయ్ బహూకరించారు. అదేవిధంగా గ్రామానికి రూ.60వేల విలువ చేసే బాడీ ఫ్రీజర్‌ను అందజేశారు. ఇటీవల మృతి చెందిన మలిశెట్టి వెంకన్న కుటుంబానికి రూ.25వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకన్న, శ్రీనివాస్, శరత్, నల్లమురళి, లత, వనజ, అనిల్, విజయ, వెంకన్న, దశరథం, గురువులు సత్తయ్య, విజయలక్ష్మీ, రహమాన్ పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలి



ఎమ్మెల్యేకు బొకే ఇస్తున్న యూనియన్ నాయకులు

మహబూబాబాద్: ట్రైబల్ జర్నలిస్టులందరూ సమస్యలపై ఐక్యంగా ఉద్యమించి సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ట్రైబల్ జర్నలిస్టులు నిజాయితీ గల వార్తలు రాసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్, ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్, బాలునాయక్, నెహ్రూ, సునీత, గిరి, యూనియన్ నాయకులు లక్ష్మణ్, రాము, రవి, శ్రీనివాస్, ఇస్లావత్ దేవేందర్, ఇస్లావత్ రవీందర్ పాల్గొన్నారు.